పరిగిలో భారీ బందోబస్తు

పోలీస్‌స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ..

పరిగి, నవంబర్ 13 : దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై జరిగిన దాడి ఘటనలో అరెస్టు చేసిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వికారాబాద్‌లోని డీటీసీ నుంచి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి సైతం పరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని మాజీ ఎమ్మెల్యే రిమాండ్ అంశాన్ని పర్యవేక్షించారు. పరిగి పోలీసు సర్కిల్ కార్యాలయంలో భోజనం అనంతరం మధ్యాహ్నం 3.15 గంటలకు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని కొడంగల్‌కు పోలీసు వాహనంలో తరలించారు. పరిగి పోలీస్ స్టేషన్ వద్ద ఎవరినీ లోపలికి, కనీసం గేటు వద్దకు సైతం రానీయకుండా పోలీసులను మోహరించారు. ఈ సందర్భంగా పరిగి మండలం గోవిందాపూర్‌లో ఇంటి విషయంలో జరిగిన గొడవకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రమేశ్, కవితలతోపాటు ఇతరులను సైతం పోలీసులు పోలీస్‌స్టేషన్ లోపలికి అనుమతించలేదు. ఇపుడు దరఖాస్తు తీసుకోబోమని, తర్వాత రమ్మం టూ వారిని గేటు వద్ద నుంచే తిప్పి పంపించారు.ఇదిలావుండగా కలెక్టర్‌పై దాడి ఘటనలో బుధవారం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితోపాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. మిగతా నలుగురికి పరిగిలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి కొడంగల్‌కు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పరిగి నుంచి కొడంగల్‌కు తరలిస్తున్న దృశ్యం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కులకచర్ల, నవంబర్ 13: కులకచర్ల కేజీబీవీ పాఠశాలలో 10వ, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణులు అయ్యేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కులకచర్ల గ్రామ పంచాయతీకార్యదర్శి, ఎంపీవో భాస్కర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల, కళాశాలలో అందించే భోజనం చాలా బాగుందని ఇదే విధంగా ప్రతి రోజూ అందించాలని సూ చించారు. కార్యక్రమంలో ఎస్‌వో దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జావెలిన్‌త్రోలో రజత పతకం

పరిగి, నవంబర్ 13 : ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ కళాశాలల స్థాయి మహిళా టోర్నమెంట్‌లో జావెలిన్‌త్రోలో పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.రమణి రజత పతకం సాధించింది. రమణి పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్సీ తృతీయ సంవత్సరం చదువుకుంటున్నది. జావెలిన్ త్రోలో రజత పతకం సాధించిన విద్యార్థిని రమణిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతా పద్మావతి, కళాశాల స్పోర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ డెవిడ్ విల్సన్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంపత్, అధ్యాపకులు అభినందించారు.

రూ.7.17 కోట్ల విలువైన డ్రగ్స్ దహనం

సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని 31 పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుబడిన రూ.7 కోట్ల 17లక్షల 82వేల 650 విలువ చేసే 2,380 కిలోల డ్రగ్స్‌ను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీఎన్‌ఏబీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఆధ్వర్యంలో పోలీసులు దహనం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సైబరాబాద్ పరిధిలోని శంషాబాద్, రాజేంద్రనగర్, మాదాపూర్, బాలానగర్, మేడ్చల్ జోన్‌లకు చెందిన 31 పోలీసు స్టేషన్ల పరిధిలో 155 కేసులకు సంబంధించి పట్టుబడిన రూ. 7.17 కోట్ల విలువ చేసే 2,380 కిలోల నార్కొటిక్ డ్రగ్స్‌ను నందిగామ మండలం, ఏదులపల్లి గ్రామంలోని జీజే మల్టికేవ్ ప్రై.లి.లో దహనం చేశారు. ఈ దహన ప్రక్రియను క్రైమ్ డీసీపీ కె.నర్సింహ, సైబర్ క్రైమ్స్ ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కొటిక్స్ అదనపు డీసీపీ జి. నర్సింహారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఎల్బీనగర్, నవంబర్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్ న్యూ మారుతీనగర్‌కు చెందిన గుబ్బల లోకేశ్ కూతురు గుబ్బల త్రిష (20) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ కాలేజీలో డిప్లోమా మూడో సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం ఆమె కాలేజీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరి.. కర్మన్‌ఘాట్ మండ మల్లమ్మ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డును దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కిందపడిపోయింది. ఆ వెంటనే వచ్చిన కారు కూడా ఆమెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై పడిపోయింది. ఈ ఘటనలో త్రిష అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్, నవంబర్ 13: జీడిమెట్ల లోని గోవర్ధన అట్టల తయారీ కంపెనీలో బీహార్ రాష్ట్రానికి చెందిన శివశంకర్ పాశ్వాన్ (33) కొంతకాలంగా ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. పనిలో భాగంగా బుధవారం కంపెనీలో మిషన్ ఆపరేటింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న మెథడిస్టు జాతర...

ధారూరు, నవంబర్ 13: మండల పరిధిలోని ధారూరు స్టేషన్- దోర్నాల్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న మెథడిస్టు క్రిస్టియన్ జాతర కొనసాగుతున్నది. బుధవారం హెల్స్ డెస్కును ఏర్పాటు చేసి, జాతర ప్రాంగణంలోని పరిసరాలను ధారూరు ఎంపీడీవో నర్సింహులు, తహసీల్దార్ షాజిదాబేగం, ఎంపీవో షఫీఉల్లా తో కలిసి పరిశీలించారు. వారి వెంబడి పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. పోలీసులు జాతర ప్రాంగణంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు. చర్చి నిర్వాహకులు వసతులు కల్పించారు. జాతర ఆదివారం వరకు కొనసాగుతుంది.

మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, నవంబర్ 13: గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు అందేలా కృషి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం, డంపింగ్‌యార్డులు, క్రీమీటోరియం వంటి పనులు నిర్వహించాలని సూచించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీకి 10వేల మొక్కలు నాటేందుకు మొత్తం మండలంలో 4,40,000 మొక్కలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్‌గౌడ్, ఏపీవో చంద్రశేఖర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతికుమారి
- ధాన్యం సేకరణ, ఇంటింటి సర్వే పురోగతిపై సమీక్ష

వికారాబాద్, నవంబర్ 13 : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 17, 18వ తేదీల్లో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి సీఎస్ శాంతికుమారి బుధవారం సాయంత్రం ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గ్రూప్-3 పరీక్షల సన్నద్ధతతో పాటు వరి ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి కుటుంబ సర్వే తదితర అంశాల పురోగతిపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రూప్-3 పరీక్ష నిర్వహణ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ మహేందర్ రెడ్డి తెలియజేశారు. నవంబర్ 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని, 18వ తేదీన మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష ఉంటుందని వివరించారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేయాలని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ అనుమతిలేదన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ , పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా జరిపించాలని చైర్మన్ సూచించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్న పత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎగ్జామినేషన్ సెంటర్స్‌కు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రం లోనికి ఇతరులు ఎవరినీ అనుమతించకూడదని, పరీక్షా సమయం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. దివ్యాంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులతో పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమవెంట వైకల్యం ధ్రువీకరించే సర్టిఫికెట్ తేవాలని స్పష్టం చేశారు. ఈసారి కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనను అనుసరిస్తూ స్ట్రైబ్‌లను పరీక్షకు 24 గంటల ముందు దివ్యాంగులైన అభ్య ర్థులతో పరిచయం చేయించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్ తదితర వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని, అన్ని కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితరులకు పరీక్షల నిర్వహణ తీరు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వీలుగా శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. అన్ని కేంద్రాలలోనూ సీ.సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, తమ కార్యాలయం కంట్రోల్ రూమ్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల నిర్వహణ తీరును పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వరి ధాన్యం సేకరణపై సమీక్ష జరిపారు. ధాన్యం కొనుగోలు జరిపే సమయంలోనే ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను తప్పనిసరిగా వినియోగించేలా హార్వెస్టర్ల యజమానులకు, ప్రతి కేంద్రంలో ధాన్యం ఆరబెట్టే యంత్రాలను అందుబాటులో ఉంచుతూ, ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎస్ శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్లతో పాటు ఇతర జిల్లా అధికారులందరూ క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా విధిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించాలని తెలిపారు. అదేవిధంగా పత్తి కొనుగోళ్లను కూడా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల విశ్లేషణకై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర వివరాలు సేకరించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఉమహారతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

మహా నగరంలో మోసగాడు

- నేవీలో ఉద్యోగాలు.. వ్యాపారంలో పెట్టుబడి పేరుతో టోకరా
- నిందితులను అరెస్టు చేసిన మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్, నవంబర్ 13: అతడో మోసగాడు. తన మాయమాటలతో మభ్యపెట్టి లక్షల్లో దండుకుని ఉడాయిస్తాడు. తాను పేరుగాంచిన జ్యోతిష్య నిపుణుడనని.. రాజకీయ పలుకుబడి, పరపతి ఉన్నదని చెప్పి నేవీలో ఉద్యోగం పేరిట ఒకరిని, వాస్తు దోషానికి పరిహారం చేస్తానని నమ్మించి మరొకరిని, వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలంటూ వేరొకరిని మోసాలు చేసి లక్షల రూపాయలు దోచుకొని మోసగించిన ఆ మాయగాడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని హెచ్‌బీ రెసిడెన్సీలో మానాపురం ఉమా మధుసూదన్ (52) మార్చి నెలలో అద్దెకు దిగాడు. అతడితో పాటు అతడి ఫ్లాట్‌లో పి.సంతోష్ కుమార్, జె.రాకేశ్, పి.సుమాంజలి అనే మహిళ కూడా ఉన్నారు. తాను జ్యోతిష్య నిపుణుడనని.. ఓఆర్ఎస్ హెల్త్ డ్రింక్స్ బిజినెస్‌తో పాటు తనకు రాజకీయంగా మంచి పలుకుబడి ఉన్నదని చుట్టుపక్కల ఫ్లాట్ వాళ్లకు చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలో ఇదే ప్రాంతంలో ఉంటున్న నర్సింగరావు తనకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, తన ఇంటి వాస్తును చూడాలని ఉమా మధుసూదన్‌ను సంప్రదించాడు. పూజలు చేయాలని చెప్పి అతడి నుంచి రూ.లక్షలు దండుకున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఎస్.రాంబాబు వద్ద కూడా అతడి కుమారుడికి ఇండియన్ నేవీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తన రాజకీయ పలుకుబడితో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని నమ్మబలికి మరో లక్ష దండుకున్నాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉండే పల్లే సరితతో వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి రూ.7.5 లక్షలు స్వాహా చేశాడు. ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడం.. డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు కాకపోవడం.. వ్యాపారంలో ఇస్తానన్న లాభాల మాట అటుంచి.. అసలు డబ్బే ఇవ్వకుండా చెప్పాపెట్టకుండా ఇంటికి తాళం వేసి ఉడాయించాడు. వేర్వేరు ఫిర్యాదులతో మూడు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు.. పరారీలో ఉన్న నిందితుడు మధుసూదన్, అతడికి సహకరించిన సంతోష్, రాకేశ్, సుమాంజలిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బాధితులు ఇంకా ఉంటే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సూచించారు.

పోలీసులపై రాళ్లతో దాడి

మెహిదీపట్నం, నవంబర్ 13: గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మాంగార్ బస్తీలో నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడి జరిగింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఈ ఘటనలో టీ న్యాబ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్‌కు, స్థానిక పీఎస్ ఎస్ఐలకు గాయాలయ్యాయి. ఒక ఎస్ఐకి సంబంధించిన రెండు తులాల బంగారు చైన్ చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. మాంగార్ బస్తీలో నివసించే దీపక్ కాంబ్లే (37), అరుణ్ కాంబ్లే (35) పెద్ద ఎత్తున గంజాయి నిల్వ ఉంచుకుని అమ్ముతున్నట్లు టీ న్యాబ్ (నార్కోటిక్) పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు మంగళవారం రాత్రి టీన్యాబ్‌కు చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు తమ బృందంతో హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి.. స్థానిక పోలీసుల సహకారం కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాంబాబు చర్చిస్తుండగానే.. టీన్యాబ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ రాజేశ్, హబీబ్‌నగర్ ఎస్ఐ శివ, మరో 15 మంది కలిసి మాంగార్ బస్తీకి వెళ్లారు. అక్కడ పోలీసుల రాకను గమనించిన దీపక్, అరుణ్ సుమారు 30 మందితో కలిసి పోలీసులపై రాళ్లతో దాడి చేయడమే కాకుండా కింద పడేసి కొట్టారు. ఈ దాడిలో టీ న్యాబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, హబీబ్‌నగర్ ఎస్ఐ శివకు గాయాలయ్యాయి. అంతేకాకుండా.. ఎస్ఐ శివ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును కొట్టేశారు. సమాచారం అందుకున్న దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆదేశాలతో అదనపు డీసీపీ అశ్వాక్ అహ్మద్, ఏసీపీ విజయ్ శ్రీనివాస్ హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసులపై దాడికి కారణమైన దీపక్, అరుణ్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎస్ఐ శివ ఫిర్యాదుతో హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించాలి

బంట్వారం, నవంబర్12 : తాండూరు-జహీరాబాద్ రూట్‌లో నడిచే తాండూరు ఆర్టీసీ బస్ డిపో బస్సులు సమయ పాలన పాటించాలని ఉద్యోగులు కృష్ణ, రఘువీర్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సకాలంలో బస్సులు రాకపోవడంతో తాము విధులకు సమయానికి చేరుకోలేక పోతున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా తాండూరు-జహీరాబాద్ బస్సులు కొన్ని రోజులుగా సమయపాలన పాటించడంలేదన్నారు. ఉదయం తాండూరు నుంచి 6 గంటలకు జహీరాబాద్ వెళ్లాల్సిన బస్సు గంటన్నర ఆలస్యంగా నడుస్తున్నది. దీంతో తాండూరు నుంచి మండల పరిధిలోని తొరుమామిడి, బొపునారం, బస్వపూర్ గ్రామాలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు, ఇతర పెద్దేముల్ మండలంలోని తట్టిపల్లి, బండమీదిపల్లి గ్రామాలకు ప్రభుత్వ ఉద్యోగులు సకాలంలో చేరుకోలేకపోతున్నామన్నారు. అయితే ఇదే బస్సు జహీరాబాద్ కు వెళ్లి తిరిగి 8.30 గంటలకు తాండూరుకు బయలు దేరాల్సి ఉంటుంది. ఈ బస్సుకు సైతం జహీరాబాద్ నుంచి అనేక మంది ఉద్యోగులు, వ్యాపారులు ఉదయం కుంచావరం, తొరుమామిడి, బొపునారం, పెద్దేముల్, అడికిచర్ల, తట్టిపల్లి గ్రామాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు, వ్యాపారులు సకాలంలో చేరుకోలేకపోతున్నామని చెప్పారు. ఈ ఒక్క బస్సు ఆలస్యంగా నడవడంతో సుమారు వంద మంది ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా రాథోడ్



ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మార్కెట్ కమిటీ కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్

నవాబుపేట, నవంబర్ 13: నవాబుపేట మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా రాథోడ్, వైస్ చైర్మన్‌గా మాలీస్ బల్వంత్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నవాబుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమించినట్లు స్థానిక శాసన సభ్యులు కాలె యాదయ్య తెలిపారు. త్వరలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యుల ఎన్నికకు సహకరించిన వారందరికీ ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్

పెద్దేముల్,నవంబర్ 13: రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జి.అంజయ్య, వైస్‌చైర్మన్ ఎస్.నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జనగాం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వ ర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320 , బి-గ్రేడ్‌కు రూ.2300 ఇస్తుందన్నారు. అలాగే సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2320, మరో రూ.500 బోనస్ గా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్ రెడ్డి, ఉప్పరి మల్లేశం, గోపాల్, విద్యాసాగర్, బందెయ్య, ఎన్.ఎల్లారెడ్డి, డీవై నర్సింహులు, కోహిర్ రవిశంకర్, కిరణ్, సాబేర్, విజయ్‌కుమార్, నర్సింహులు, శివకుమార్, అనంతయ్య, హర్షవర్ధన్, రాములు యాదవ్, వెంకటయ్య, మల్లయ్య, ఎండీ.మైపూజ్, యాదప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం..

కులకచర్ల, నవంబర్ 13: ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వస్తువులు కాలిపోయాయి. దీంతో బాధిత కుటుంబానికి పంచాయతీ కార్యదర్శులు రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

కులకచర్ల, నవంబర్ 13 : చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన పరిగి ప్రేమ్‌కుమార్ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తూ మృతి చెందాడు. దీంతో ఆయన భార్య మాధవిని గ్రామ పంచాయతీ కార్మికురాలిగా నియమించారు. కాగా చౌడాపూర్ ఉన్నత పాఠశాలలో 2007లో పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆయన కుటుంబానికి రూ.